క్లుప్తంగా

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం : ఎమ్మెల్యే

మలక్‌పేట: అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సముచిత ప్రాధాన్యం కల్పిస్తోందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శనివారం సలీంనగర్‌లోని సఫైర్ ఫంక్షన్ హాల్లో బీసీ, ఓబీసీలు 272 మందికి ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీపీఓ జాయింట్ డైరెక్టర్, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ సురేందర్, డిస్ట్రిక్ట్ బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆశన్న, జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 డీపీఓ యుగంధర్ పాల్గొన్నారు.

సింగరేణిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చండి: సీపీఐ

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను వెంటనే మెరుగుపర్చాలని డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సీపీఐ నాయకులతో కలిసి వైశాలీనగర్ వాటర్‌వర్క్స్ అధికారి రాజేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి కాలనీ గుడిసెల్లో, వాంబే గృహ సముదాయాల్లో నిత్యం డ్రైనేజీలు పొంగి మురుగు రహదారులపై పారుతోందని, తాగునీటి పైప్‌లైన్లలోకి డ్రైనేజీ నీరు కలుస్తోందన్నారు. దీంతో సింగరేణి వాసులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సింగరేణి కాలనీలో డ్రైనేజీలను ఆధునీకరించాలన్నారు. సీపీఐ నాయకులు అంజయ్య, బాలు నాయక్,గిరి పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు కేటాయించాలని నిరాహారదీక్ష

మన్సూరాబాద్: జీహెచ్‌ఎంసీ పరిధిలో లాటరీ విధానంలో కేటాయించిన డబుల్ ఇళ్లలో ఎరుకల నాంచారమ్మ బస్తీవాసులకు కేటాయించకపోవడం తీవ్ర ఆందోళనకు గురి చేసిందని ఎరుకల సంఘం నాయకులు జగన్నాథం, గంగయ్య అన్నారు. తమకు ఇళ్లు కేటాయించకపోవడంతో నాంచారమ్మ బస్తీవాసులు నాగోలు డివిజన్ పరిధిలోని డబుల్ ఇళ్ల సముదాయాల వద్ద శనివారం రాత్రి నిరహార దీక్ష చేపట్టారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో 50 వేలకు పైగా అర్హులైన దరఖాస్తుదారులున్నారని, ప్రభుత్వం కేవలం వందల్లో మాత్రమే ఇళ్లు నిర్మించి పేదలను మోసం చేస్తోందని విమర్శించారు. లింగయ్య, స్వామి,మల్లేష్, వెంకన్న,రామకృష్ణ పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిదండ్రులు సమయం కేటాయించాలి

నాగోలు: తల్లిదండ్రులు పిల్లల కోసం సమయం కేటాయించాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం కొత్తపేట సత్యానగర్‌లోని ఓక్ వుడ్ ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో గుడ్ పేరెంటింగ్ అంశంపై ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లల కోసం తల్లిదండ్రులు సమయం కేటాయించాలని, స్నేహంగా మెలగాలని, ప్రతి రోజు తరగతి పాఠాలను కథల రూపంలో మలిచి వివరించాలన్నారు. స్కూల్ చైర్మన్ లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ లయన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, శారద పాల్గొన్నారు.

యోగాతో శారీరక దృఢత్వం, మానసికోల్లాసం

సైదాబాద్: యోగా సాధనతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్ అన్నారు. సైదాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రతీ శనివారం పోలీసులు యోగా సాధన చేస్తున్నారు. ప్రముఖ యోగా ట్రైనర్ విజయ్ పోలీసులతో ధ్యానం, ఆసనాలు సాధన చేయిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం డీసీపీ మాట్లాడుతూ, నిత్యం విధి నిర్వహణలో సతమతమవుతున్న పోలీసులు వ్యాయామానికి సమయం కేటాయించలేక పోతున్నారన్నారు. నిత్యం యోగా సాధన చేస్తే ఆరోగ్యం సిద్ధించడమే కాకుండా మానసికంగా ఎంతో ఉత్తేజితులవుతారని అన్నారు. సైదాబాద్ ఏసీపీ వెంకన్న నాయక్, ఇన్‌స్పెక్టర్ రవి మొలుగూరి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమ్ ఆర్మీ కమిటీ నియామకం

మలక్‌పేట: జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేడ్కర్, కాన్షీరాం ఆలోచన విధానంతో ముందుకు సాగాలని భీమ్ ఆర్మీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వనం మహేందర్ అన్నారు. స్టేట్ జనరల్ సెక్రటరీ పెండేకంటి రవికుమార్ అధ్యక్షతన శుక్రవారం రాత్రి నిర్వహించిన హైదరాబాద్ ఈస్ట్‌జోన్ నియోజకవర్గాల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ మలక్‌పేట నూతన కమిటీ అధ్యక్షుడిగా బొట్టు శ్రీను, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ అబ్దుల్ అసద్, జనరల్ సెక్రటరీగా పోలేపాక వెంకన్నను నియమించారు.

యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కరీం

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కరీమ్ నియమితులయ్యారు. శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో కరీమ్‌కు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ మల్‌రెడ్డి రాంరెడ్డి నియామకపత్రం అందజేశారు.

పారదర్శకంగా ‘డబుల్’ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

- 15 రోజుల్లో రెండో విడత పంపిణీ చేస్తాం
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


ఇళ్ల లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సర్కిల్ అధికారులు

ఎల్‌బీనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శంగా నిర్వహించామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో మొదటి విడితగా 500 మంది లబ్ధిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేసిన అధికారులు శనివారం వారికి ఇళ్లు అందజేశారు. ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయం నుంచి ప్రతాప్‌సింగారం వరకు లబ్ధిదారులను తీసుకెళ్లడానికి ఏర్పాటు చేసిన ఉచిత బస్సులను ఆయన ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి సుమారు 4752 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా తెలంగాణ ప్రభుత్వం పేదలకు నీడ కల్పించడమే ధ్యేయంగా పెట్టుకొని డబుల్ బెడ్రూమ్ ఇళ్లతో పాటు సొంత స్థలం ఉన్నవారు ఇళ్లు నిర్మించుకొనేందుకు గృహలక్ష్మి పథకం ద్వారా రూ. 3 లక్షలు అందిస్తోందన్నారు. అర్హులైన పేదలకు విడితల వారీగా ఇళ్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీలు రవీందర్. దశరథ్, మాజీ కార్పొరేటర్ భవానీ ప్రవీణ్‌కుమార్, నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్, బేర బాలకిషన్, శ్రీశైలంయాదవ్, మహేందర్‌యాదవ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఇలా ఉండగా, ఎన్నో ఏళ్లగా ఎదురు చూస్తున్న తమ సొంతింటి కల ఇప్పుడు నెరవేరిందని పలువురు మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. సంక్రాంతి, దీపావళిలా తమకు ఇది ఒక పండుగ రోజు అని అన్నారు. ఇంకా వారేమన్నారంటే...

పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి

సైదాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నారని బీఆర్‌ఎస్ యాకుత్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జ్ సామ సుందర్‌రెడ్డి అన్నారు. శనివారం సైదాబాద్ మండల కార్యాలయం వద్ద ఐఎస్‌సదన్ డివిజన్ నుంచి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరైన వారితో ఆయన మాట్లాడారు. ఐఎస్‌సదన్ డివిజన్ నుంచి మొత్తం 58 మందికి మహేశ్వరం మండలం మంకాల గ్రామంలో ఇళ్లు మంజూరయ్యాయి. వారిని ఆర్టీసీ బస్సులో సైదాబాద్ మండల కార్యాలయం నుంచి మంకాలలోని ఇళ్ల వద్దకు ఆయన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సామ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిచి కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయమని సుందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.


సైదాబాద్ తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో సామ సుందర్‌రెడ్డి

సొంతి ఇంటి కల నెరవేరింది



నాలుగేళ్ల క్రితం డబుల్ బెడ్‌రూం ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఎప్పుడో రావల్సిన ఇల్లు ఇప్పుడు చేతికొచ్చింది. ఎన్నో ఏళ్ల మా సొంతింటి కల నేడు నెరవేరింది. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. పైసా ఖర్చులేకుండా మాకు ఇళ్లు ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది ఈ రోజు. కేసీఆర్‌సార్‌కు కృతజ్ఞతలు.

– మంగలక్ష్మి, వనస్థలిపురం

ఎప్పుడెప్పుడా అని చూశాం



డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం మేము దరఖాస్తు చేసి నాలుగేళ్లు దాటింది. అప్పటి నుంచి ఎప్పుడెప్పుడా అని ఇంటి కోసం చూశాం. ఒక దశలో అది వస్తుందనే ఆశ కూడా లేకుండాపోయింది. చివరకు ముఖ్యమంత్రి కేసీఆర్ తమ ఆశను నెరవేర్చారు. తాము జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటాం.

–ఊశమ్మ, చంపాపేట

ఆనందంగా ఉంది



ఈ రోజు మా కుటుంబం ఆనందంగా ఉంది. డబుల్ బెడ్రూమ్ ఇంటి కోసం ఎంతగానో తపన పడ్డాం. ఈ రోజు ఆ కల నెరవేరింది. దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలా ఈ రోజు మాకొక పండుగ రోజు. పేదలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా ఇళ్లు ఇచ్చింది. జీవితాంతం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

– ప్రశాంతకుమారి, వనస్థలిపురం

తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగు


వల్లూరు చంద్రశేఖర్ (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగు నింపాడు రిటైర్డ్ ఉద్యోగి. జీవన్‌దాన్ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం... నాగోలు డివిజన్ పరిధి సాయిసప్తగిరి కాలనీకి చెందిన వల్లూరు చంద్రశేఖర్ (62) రిటైర్డ్ ఉద్యోగి. ఆగస్టు 30న సాయంత్రం 6.35 గంటల ప్రాంతంలో ఇంటిలో చంద్రశేఖర్ అకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్స్‌కు తరలించారు. మూడు రోజుల చికిత్స అనంతరం ఈనెల 1న బ్రెయిన్‌డెడ్ అయినట్లు కామినేని వైద్యులు నిర్ధారించారు. జీవన్‌దాన్ ప్రతినిధులు చంద్రశేఖర్ భార్య వసుంధరాదేవి, ఇతర కుటుంబసభ్యులను కలిసి అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు చంద్రశేఖర్ ఒక కిడ్నీ, లివర్, ఊపిరితిత్తులు, రెండు కార్నియాలను దానం చేశారు. ఈ అవయవాలను వేర్వేరు ఆస్పత్రుల్లో అవయవమార్పిడి కోసం ఎదురు చూస్తున్న రోగులకు అమర్చనున్నట్లు జీవన్‌దాన్ కోఆర్డినేటర్ తెలిపారు.

గ్యాస్ ధర తగ్గింపుపై బీజేపీ హర్షం


మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ తదితరులు

మలక్‌పేట: ప్రధాని నరేంద్ర మోదీ గ్యాస్ ధర రూ.200లు తగ్గించడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మూసారంబాగ్ డివిజన్ ఎస్‌బీఐ ఆఫీసర్ కాలనీ టీ జంక్షన్‌లో స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సండడి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గౌర దేవేందర్, నాయకులు సురేందర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో పార్కు స్థలం కబ్జా: కొప్పుల

జీహెచ్‌ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్


రాజరాజేశ్వరీ కాలనీలోని పార్కు స్థలం కబ్జాపై ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్

మన్సూరాబాద్: హయత్‌నగర్ పరిధిలోని రాజరాజేశ్వరీ కాలనీలోని 600 గజాల పార్కు స్థలాన్ని పోర్జరీ సంతకాలతో కబ్జా చేసి స్కూల్ భవనాన్ని నిర్మించారని, జీహెచ్‌ఎంసీ అధికారుల అండతోనే కబ్జాలు జరుగుతున్నాయని జీహెచ్‌ఎంసీలో బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆరోపించారు. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డికి శనివారం ఆయన సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మన్సూరాబాద్‌లో మాట్లాడుతూ, నియోజకవర్గంలోని పార్కు స్థలాలన్నీ అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. పార్కు స్థలంలో ప్రైవేట్ స్కూల్‌ను నిర్మించారని, ఈ విషయమై గతేడాది నుంచి జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో, పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా అధికారుల్లో స్పందన లేదని మండిపడ్డారు. ఫోర్జరీ సంతకాలతో పత్రాలు సృష్టించి స్థలాన్ని కబ్జా చేసిన వారిపై హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని గుర్తు చేశారు. ఇప్పటికైనా సంబంధిశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వైశ్య గర్జన సభకు అనుమతివ్వండి


రాచకొండ సీపీ చౌహాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణ గుప్తా తదితరులు

నాగోలు: వైశ్య హక్కుల సాధన కోసం అక్టోబర్ 1న సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించే వైశ్య గర్జన సభకు అనుమతి ఇవ్వాలని కోరుతూ శనివారం ఎల్‌బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్‌కు వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్తా, వైశ్య ప్రతినిధులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, అగ్ర కులాలు అని చెప్పుకునే తమ వైశ్య కులస్తుల్లో ఎక్కువగా మంది పేదలు ఉన్నారన్నారు. వైశ్యుదదదల హక్కుల సాధనాలతో పాటు వైశ్య జాతి కోసం కార్పొరేషన్ సత్వరమే ఏర్పాటు చేసే విధంగా పోరాటం చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల్లో సరైన ప్రాధాన్యత కల్పించాలని కోరుతున్నామని, అక్టోబర్ 1న నిర్వహించే వైశ్య గర్జనకు తెలంగాణ నలుమూలల నుంచి వేలాది మంది వైశ్యులు తరలి రావాలని ఆయన కోరారు.

ఇసుక లారీల అడ్డా తొలగించాలని బీజేపీ ధర్నా


ధర్నాలో పాల్గొన్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు

వనస్థలిపురం: ఆటోనగర్ సమీపంలో ఉన్న ఇసుక లారీల అడ్డా వల్ల 21 కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, లారీల అడ్డా తొలగింపులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విఫలమయ్యారని బీజేపీ రంగారెడ్డి జిల్లా (అర్బన్) అధ్యక్షుడు సామ రంగారెడ్డి, పలువురు కార్పొరేటర్లు ఆరోపించారు. ఆటోనగర్‌లో ఇసుక లారీ అడ్డాను తొలగించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు శనివారం ఆటోనగర్ ఇసుక లారీ అడ్డా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, లారీ అడ్డా తొలగింపునకు హ్యూమన్ రైట్స్ కమిషన్, కలెక్టర్, ట్రాఫిక్ డీసీపీ, మున్సిపల్ కమిషనర్ ప్రొసీడింగ్స్ ఇచ్చినా, స్వాక్షాత్తు మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చినా అడ్డా తొలగింపుకు నోచుకోలేదన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్వలాభం కోసం లారీ అడ్డా తొలగించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ, లారీల అడ్డా వల్ల రోడ్లపై ఇసుక పేరుకుపోయి ద్విచక్రవాహనాలు స్కిడ్ అవుతున్నాయని, రోడ్లు ఊడ్చే స్వీపర్లు నలుగురు యాక్సిడెంట్లకు గురై చనిపోయారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, పవన్‌కుమార్, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, కళ్లెం రవిందర్‌రెడ్డి, ఎల్లప్ప, విజయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, అప్పారావు, కృష్ణవేణి, గోవిందాచారి, చంద్రపాల్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అనంతరెడ్డి ఎంపిక


మంచిరెడ్డి అనంతరెడ్డి

చంపాపేట: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు చంపాపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంచిరెడ్డి అనంతరెడ్డి ఎంపికయ్యారు. 1984లో యాచారం మండలం తంబోళ్లగూడెం ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా ఉద్యోగంలో చేరిన అనంతరెడ్డి పలు పాఠశాలల్లో పని చేశారు. 2011, 2017లో రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు. తన 40 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో ఇప్పటి వరకు 16 సంవత్సరాలు ప్రాథమిక పాఠశాలల్లో, 24 సంవత్సరాలు ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం చంపేట పాఠశాలలో పని చేస్తున్న అనంతరెడ్డి 2023 సంవత్సరానికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. తనకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు ప్రకటించడం ఆనందంగా ఉందని, అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని అనంతరెడ్డి అన్నారు.

బాలల గృహాన్ని తనిఖీ చేసిన ఎంఎల్‌ఎస్‌ఏ చైర్‌పర్సన్


గృహంలోని ఏర్పాట్లను జస్టిస్ ప్రేమావతికి వివరిస్తున్న డీడీ మీర్జా రజా అలీబేగ్

సైదాబాద్: సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలల గృహం, పరిశీలన గృహం, బాలల ఆర్చరీ కేంద్రాలను మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎంఎల్‌ఎస్‌ఏ) చైర్‌పర్సన్, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్.ప్రేమావతి ఆకస్మిక తనిఖీ చేశారు. శనివారం ఉదయం బాలల గృహానికి చేరుకున్న ఆమె అక్కడి చిన్నారులతో మాట్లాడారు. ఆర్చరీ కేంద్రంలో శిక్షణ పొందుతున్న వారితో ముచ్చటించారు. గృహంలో బాలలకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీర్జా రజా అలీ బేగ్ ఆమెకు వివరించారు. గృహాలలో బాలలకు అందిస్తున్న సౌకర్యాలపై చైర్‌పర్సన్ సంతృప్తి వ్యక్తం చేశారని డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ రాధికా జైస్వాల్, హోం సూపరింటెండెంట్ అఫ్జల్‌షా అలీ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించి దేశానికి మంచి పేరు తేవాలి


క్రీడాకారులతో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: క్రీడాకారులు క్రీడాల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి మంచిపేరు తేవాలని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శనివారం నాగోలు మమతానగర్ కాలనీలో నిర్వహించిన 39వ తెలంగాణ స్టేట్ తైక్వాండో ఛాంపియన్ షిప్–2023 పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిచారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జాతీయ సెన్సార్ బోర్డు మెంబర్ మొగులపల్లి ఉపేందర్ గుప్తా, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి చింతల సురేందర్ యాదవ్, టీఎఫ్ఐ అడ్వయిజర్ మనోజ్ కుమార్, ట్రెజరర్ శ్రీకాంత్ , వైస్ ప్రెసిడెంట్ కిషోర్ కుమార్, ఒలంపిక్ ఫార్మర్ ట్రెజరర్ సోమేష్ కుమార్, జాయింట్ సెక్రెటరీ మల్లారెడ్డి, స్టేట్ మెంబర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి నిత్యావసరాల అందజేత



వనస్థలిపురం: వనస్థలిపురంలోని నాగార్జున మాంటిస్సోరి, ఐఐటీ ఒలింపియాడ్ విద్యార్థులు శనివారం స్థానిక వివేకానంద అనాథాశ్రమానికి ఐదు క్వింటాళ్ల బియ్యం, 50 కిలోల కందిపప్పు విరాళంగా అందజేశారు. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన ఛారిటీ డే సందర్భంగా విద్యార్థుల నుంచి సేకరించిన సరుకులకు తోడు పాఠశాల యాజమాన్యం మరికొంత కలిపి ఆశ్రమానికి విరాళంగా ఇచ్చారు. విద్యా సంస్థ చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి, సీఈఓ శేషారావు, అకడమిక్ డీన్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఇన్‌చార్జీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహానేత వైఎస్‌ఆర్‌కు ఘన నివాళి


ఎల్‌బీనగర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి


కర్మన్‌ఘాట్‌లో.. నివాళులర్పిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి


చిత్రలేవుట్ కాలనీలో .. నివాళులర్పిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఘన నివాళులర్పించారు. ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలో మహానేత వైఎస్‌ఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేదల పెన్నిధి, సంక్షేమ సారథి వైఎస్‌ఆర్ అని కొనియాడారు. పేదలకు కార్పొరేటర్ వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ, ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు 108 అంబులెన్స్, పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఫీజురీయింబర్స్‌మెంట్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, మహిళలకు పావలా వడ్డీకి రుణాలు వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి జననేతగా వైఎస్‌ఆర్ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు.

◆ రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత ఆధ్వర్యంలో చిత్రలేవుట్ కాలనీలోని వైఎస్‌ఆర్ విగ్రహానికి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

◆ **చాదర్‌ఘాట్:** ఓల్డ్‌మలక్‌పేటలో వైఎస్‌ఆర్ చిత్రపటానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ నివాళులర్పించారు. గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ చౌకి రవికుమార్, చేగిరెడ్డి మదన్, రామకృష్ణ, రాజేష్, చందు, రాజు పాల్గొన్నారు.

◆ **మన్సూరాబాద్:** ఎల్‌బీనగర్‌లోని కామినేని చౌరస్తాలోని వైఎస్‌ఆర్ విగ్రహానికి టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.నాయకులు బుడ్డ సత్యనారాయణ, ఎల్‌ఎంరెడ్డి, కళ్లెం నర్సింహారెడ్డి, పృథ్వీరాజ్, అక్రమ్, వెంకటేష్,గిరి, లాలయ్యగౌడ్, మాధవ రెడ్డి,సత్యనారాయణరెడ్డి,మహేష్ పాల్గొన్నారు.

చంపాపేటలో: కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌ఛార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి కర్మన్‌ఘాట్‌లోని వైఎస్‌ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. నాయకులు శ్రీపాల్‌రెడ్డి, వేణుగోపాల్‌యాదవ్, లింగాల కిషోర్‌గౌడ్, మంజులారెడ్డి, రమేష్‌నాయక్, జైపాల్‌రెడ్డి, షరీఫ్, కరీం, కృష్ణారెడ్డి, సౌమ్య, మాధవి, అనిత తదితరులు పాల్గొన్నారు.


చిత్రలేవుట్ కాలనీలో.. కాలనీవాసులు ముస్కు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, శివారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి


ఓల్డ్‌మలక్‌పేటలో.. వైఎస్‌ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బొల్లు కిషన్ తదితరులు